క్లుప్తంగా

ఈఓపీఆర్‌డీగా బాలాకుమార్



పెనగలూరు : మండల ఈఓపీఆర్‌డీగా బాలాకుమార్ బాధ్యతలు చేపట్టారు. బాలాకుమార్ రాజంపేట మండలం ఊటుకూరు పంచాయతీ సెక్రటరీగా పనిచేస్తూ అక్కడ నుంచి ప్రమోషన్‌పై పెనగలూరుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి సమస్యలు లేకుండా చూస్తామని వారు తెలిపారు.

డిసెంబర్ 9 వరకు గడువు..



మాట్లాడుతున్న తహసీల్దార్ దైవాదీనం

గాలివీడు : డిసెంబర్ 9వ తేది వరకు కొత్త ఓటరు నమోదు, మార్పులు చేర్పులకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించినట్లు తహసీల్దార్ దైవాదీనం పేర్కొన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఓలు, బీఎల్‌ఓల సమావేశంలో మాట్లాడుతూ 2024 ఓటరు జాబితా అన్ని గ్రామ, వార్డు సచివాలయాలు, పోలింగ్ కేంద్రాల బీఎల్‌ఓల వద్ద అందుబాటులో ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాను పరిశీలించుకోవచ్చునన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ తిమ్మారెడ్డి, ఆర్‌ఐ బాలాజీ, పలువురు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బంద్‌ను జయప్రదం చేయండి



బంద్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విద్యార్థి నేతలు

రాయచోటి అర్బన్ : కేంద్రం కడప ఉక్కు పరిశ్రమను నిర్మించాలని, విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటుపరం చేయవద్దన్న డిమాండ్‌లతో నవంబరు 8న నిర్వహింప తలపెట్టిన విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని పలు విద్యార్థి సంఘాల నేతలు పిలుపునిచ్చారు. శుక్రవారం మధ్యాహ్నం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో వారు బంద్‌కు సంబంధించిన పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విభజన చట్టం హామీలలో కేంద్రం రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ అంకన్న, ఎస్‌ఎఫ్‌ఐ నరసింహ, రమణ, ఏఐఎస్‌ఎఫ్ కోటేశ్వరరావు, ఏఐఎస్‌ఏ లవకుమార్, నేతలు వినోద్, హేమంత్, ఖాదర్‌బాషా, షరీఫ్, వెంకటేశ్వరరెడ్డి, నిత్య, సురేష్ పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

రామాపురం : నేడు మండల సర్వసభ్య సమావేశాన్ని మండలాధ్యక్షురాలు విజయలక్ష్మి ఆధ్వర్యంలో మధ్యాహ్నం 2 గంటలకు మండల పరిషత్ భవనంలో నిర్వహిస్తున్న ఎంపీడీఓ హైదర్ వలి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి హాజరవుతారని, ప్రజా సమస్యల కోసం, అభివృద్ధి కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పకుండా హాజరుకావాలని తెలియజేశారు.

రాహుకాల పూజలు

రాయచోటి టౌన్ : పట్టణంలో వెలసిన శ్రీ భద్రకాళి అమ్మవారికి శుక్రవారం రాహుకాల పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకులు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని అలంకరించి భక్తుల దర్శన ఏర్పాటు చేశారు. అలాగే నిమ్మకాయలపై వత్తులు వెలిగించి హారతులు పట్టారు. భక్తులకు రాహుకాల పూజ విశేషాలను వివరించారు. పూజలు ఆలయ పాలకమండలి అధ్యక్షురాలు పాలంరెడ్డి విజయ, ఈఓ డివి రమణారెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట

గాలివీడు : నూలివీడు గ్రామం కస్పా బోయ కాలనీలో నూతనంగా నిర్మించిన ఆలయంలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ శుక్రవారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఉమాపతిరెడ్డి, ఎంపీటీసీ అమానుల్లా, గ్రామస్తులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు కురిసి పాడి పంటలు సంవృద్ధిగా ఉండాలని ఆకాంక్షించారు.

రైతులకు మేలు చేసేలా అభివృద్ధి పనులు

రైల్వేకోడూరు అర్బన్ : రైతులకు మేలు చేసే విధంగా మండలంలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎంపీ మిథున్‌రెడ్డి, ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. పట్టణంలో మార్కెట్ వద్ద రూ.15 లక్షలతో నిర్మించిన గదులను వారు ప్రారంభించారు. అలాగే రాఘవరాజుపురం పంచాయతీలో రైతులకు ఆదాయం వచ్చే విధంగా చిరుపంటలు మార్కెటింగ్ చేసుకోవడానికి వీలుగా నూతనంగా నిర్మిస్తున్న రైతు మార్కెటింగ్ భవనం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న ప్రభుత్వం ప్రణాళికబద్ధంగా రైతులకు మేలు చేయడానికి చర్యలు తీసుకుంటుందన్నారు. ముఖ్యంగా రైల్వేకోడూరులో ఆకుకూరలు పండించే రైతులకు అనుకూలంగా తమ పంటలు మార్కెటింగ్ చేసుకోవడానికి, ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా ప్రధాన రహదారిలో రైతు మార్కెటింగ్ భవనం నిర్మించడం ఎంతో ఉపయోగకరం అన్నారు. త్వరితగతిన పనులు పూర్తవడానికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పట్టణంలోని శ్రీ భుజంగేశ్వర స్వామి దేవస్థానంలో ఎంపీ మిథున్‌రెడ్డి, ప్రభుత్వవిప్ కొరముట్ల, చైర్మన్ పోకల సుబ్బరాయుడు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.



రైతు మార్కెట్ భవనానికి భూమి పూజ చేస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే కొరముట్ల తదితరులు

నియామక పత్రాలు పంపిణీ

పట్టణంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నూతనంగా నియమితులైన ఆశ వర్కర్లు, హెల్పర్లకు నియామక పత్రాలు ఎంపీ మిథున్‌రెడ్డి, ప్రభుత్వవిప్ కొరముట్ల, సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డిలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధ్యతాయుతంగా ప్రజలకు సేవ చేయాలన్నారు. కార్యక్రమాలలో డీఏబీ చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ముప్పాల హేమనవర్మ, రాష్ట్ర టూరిజం డైరెక్టర్ సాయికిషోర్‌రెడ్డి, ఉప సర్పంచ్ తోట శివసాయి, మార్కెట్ కమిటీ చైర్మన్ సుబ్బరామరాజు, పట్టణ అధ్యక్షుడు సీహెచ్.రమేష్, జెడ్పీటీసీ రత్నమ్మ, సుధాకర్‌రాజు, లింగం లక్ష్మీకర్, ఆర్‌వి.రమణ, నిమ్మకాయల మోహన్‌రెడ్డి, కంబం శ్రీనివాసుల రెడ్డి, మహేష్ రెడ్డి, అబ్దుల్‌రాఫ్, నందబాల పాల్గొన్నారు.

బాల్య వివాహ రహిత మండలంగా తీర్చిదిద్దండి

మండల సమావేశంలో రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ అజయ్ రెడ్డి



మాట్లాడుతున్న కొండూరు అజయ్ రెడ్డి

పెనగలూరు : మండలాన్ని బాల్య వివాహ రహిత మండలంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి అన్నారు. శుక్రవారం పెనగలూరు ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఎంపీపీ సౌందర్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాల్య వివాహాలు నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. జిల్లాలో పెనగలూరు మండలంలో ఇప్పటికే 17 మంది బాల్య వివాహాలు జరిగినట్టు రికార్డులు తెలుపుతున్నాయన్నారు. అందుకే అంగన్‌వాడీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వివిధ శాఖలకు చెందిన అధికారులు బాల్య వివాహాలపై ప్రజలకు అవగాహన కల్పించి మండలాన్ని బాల్య వివాహ రహిత మండలంగా తీర్చిదిద్దాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మండల ప్రజలకు ఎంతో ఉపయోగపడిందన్నారు. మండలంలో 528 మంది ఈ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా వైద్య సేవలు పొందారన్నారు. మరో 83 మందిని వివిధ వ్యాధుల కింద కార్పొరేట్ ఆసుపత్రులకు వైద్యులు రెఫర్ చేశారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల అభివృద్ధికి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు తెలిపేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అలాగే అధికారులు ప్రజల సమస్యలు పరిష్కరించాలన్నారు. పార్టీలు, కులమతాలకు అతీతంగా స్పందన అర్జీలు, ప్రజల తెలిపిన సమస్యలను పరిష్కరించాలని కోరారు. వైఎస్సార్ జలకళ ద్వారా బోర్లు వేసి, ఉచిత విద్యుత్ అందించి మోటార్లు కూడా ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుబ్బరాయుడు, ఎంపీడీఓ వరప్రసాద్, తహసీల్దార్ శ్రీధర్ రావు, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిద్దాం

చిన్నమండెం : మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిద్దామని మండల ఉపాధ్యక్షుడు మయానా ఏజాస్‌అలీఖాన్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఎంపీడీఓ దివ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మాట్లాడుతూ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డిల కృషితో మండల వ్యాప్తంగా అభివృద్ధి పరుగులు పెడుతున్నదన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో మండల అభివృద్ధికి మరింతగా కృషి చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ శ్రీరాములునాయక్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 10,963 రేషన్‌కార్డులు ఉండగా నిత్యావసర సరుకులు అందజేస్తున్నామన్నారు. ఎటువంటి భూ సమస్యలైనా తక్షణమే పరిష్కరిస్తున్నామన్నారు. అనంతరం వ్యవసాయాధికారి గీత మాట్లాడుతూ ఈ సారి ఖరీఫ్ పంటలను తక్కువగా సాగు చేశారన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరినాథరెడ్డి మాట్లాడుతూ తాగునీటి సమస్య మండలంలో ఎక్కడా లేదన్నారు. హౌసింగ్ ఏఈ రాజేశ్వరి మాట్లాడుతూ హౌసింగ్ లబ్ధిదారులకు ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా మెటీరియల్ అందజేస్తున్నామన్నారు. మండల వ్యాప్తంగా 423 కొత్త ఇళ్లు మంజూరయ్యాయన్నారు. అవసరమైన వారు దరఖాస్తులు చేసుకోవాలని ఆమె సూచించారు. అనంతరం ఏపీఓ మాధవి మాట్లాడుతూ ప్రస్తుతం రూ.272 పడుతోందని, హౌసింగ్‌లో 90 రోజుల పనిదినాల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ పనులు కల్పిస్తామన్నారు. ఏపీఎం రెడ్డమ్మ మాట్లాడుతూ హౌసింగ్ కింద మంజూరైన లబ్ధిదారులకు రూ.35 వేలు తక్కువ వడ్డీకి బ్యాంకుల తరపున లోన్ మంజూరు చేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కో–ఆప్షన్ మెంబర్ గౌస్‌సాబ్, ఎంపీటీసీలు రమేష్, శ్యామ్‌చంద్ర, వెంకటప్పనాయుడు, రమణ, శ్రీరాములు, గంగులయ్య, సర్పంచులు ముసల్‌రెడ్డి, నజీర్‌అహ్మద్, లోకేశ్వర రెడ్డి, లక్ష్మిరెడ్డి, అఫ్రోజ్, నజీర్‌బాషా, దామోదర్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ దివ్య, పక్కన వైస్ ఎంపీపీ ఏజాజ్ అలీఖాన్

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

లక్కిరెడ్డిపల్లి : రాష్ట్రస్థాయి అండర్ – 19 క్రీడ పోటీలకు మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలకు చెందిన నందినీ, ఇందూలు ఎంపికైనట్లు పీఈటీ షర్మిలా తెలిపారు. సెప్టెంబర్ 30న జిల్లాస్థాయిలో గండి అంబేద్కర్ గురుకుల బాలుర పాఠశాలలో జరిగిన అండర్ – 17 క్రీడలలో నెట్‌బాల్, హ్యాండ్ బాల్‌లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ నెల 28న కడప స్పోర్ట్స్ స్కూల్‌లో అండర్ – 17 పుట్‌బాల్ క్రీడలకు నీలిమ వెళ్తున్నట్లు ఆమె తెలిపారు. వీరి ఎంపికపట్ల ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

మల్లూరు జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు

చిన్నమండెం : రాయచోటి పట్టణంలో జరిగిన ఎస్‌జీఎఫ్ పోటీలలో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు మల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికై నట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రెడ్డన్న శుక్రవారం తెలిపారు. త్రోబాల్‌లో అండర్ – 17విభాగంలో రెడ్డికుమార్, అండర్ – 14 విభాగంలో వెంకటశివ, వాలీబాల్‌లో అండర్ – 17 విభాగంలో రెడ్డికుమార్, అండర్ – 14 విభాగంలో వెంకటశివలు ఎంపికై నట్లు వారు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికకావడంలో కీలకపాత్ర పోషించిన పీడీ రామచంద్ర, విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



లక్కిరెడ్డిపల్లె: క్రీడలకు ఎంపికైన కేజీబీవీ విద్యార్థులు



చిన్నమండెం: విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం

వాలీబాల్ పోటీలకు నక్షత్ర

నందలూరు (రాజంపేట) : రాయచోటి పట్టణ పరిధిలోని ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఈనెల 2న ఎస్‌జీఎఫ్ అండర్ – 14 బాలికల విభాగంలో మండలంలోని పాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థినీ నక్షత్ర తమ ప్రతిభను ప్రదర్శించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవీలత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవంబర్ 9, 10, 11వ తేదీలలో విశాఖ జిల్లా పరిధిలోని అరకు నియోజకవర్గంలో జరగనున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలలో తమ విద్యార్థినీ నక్షత్ర పాల్గొనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఫిజికల్ డైరెక్టర్ సుస్మిత, పీఈటీ జగన్‌తోపాటు ఉపాధ్యాయులు ఎంపికైన విద్యార్థినీ నక్షత్రను అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రాజంపేట: నక్షత్రను అభినందిస్తున్న హెచ్‌ఎం మాధవి

అవినీతిపై జాగరూకత అవసరం

రాజంపేట : ప్రజలలో అవినీతిపై జాగరుకతను పెంపొందించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఏఐటీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరక్టరు చొప్పా అభిషేక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ నిర్వహణలో భాగంగా అవినీతి ప్రభావంపై నిర్వహించిన పోటీలలో విజేతలగా నిలిచిన వారికి బహుమతులను చొప్పా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా అవినీతి వల్ల అనేక మంది అనేక విధాలుగా నష్టపోతారన్నారు. అవినీతి మహమ్మారిని నేటి సమాజంలో అంతమొందించేలా విద్యార్థులు అవగాహన కల్పించుకోవాలన్నారు. అవినీతిని ఎక్కడక్కడి అడ్డుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.నారాయణ, హెచ్‌అండ్‌ఎస్ ఎస్‌ఓడీ బాలనాగేంద్రప్రసాద్, టచ్‌స్టోన్ ఇన్‌చార్జి విజయకుమార్, యూనియన్ బ్యాంక్ రీజనల్ ఆఫీసర్ భాస్కర్‌లు పాల్గొన్నారు. టచ్‌స్టోన్ ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంక్ వారి సహకారంతో విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ ఘనంగా జరుపుకున్నారు.



విజేతలను అభినందిస్తున్న చొప్పా అభిషేక్‌రెడ్డి

‘ఉపాధి’పై గ్రామ సభలు నిర్వహించండి


సిద్దవటం : జాతీయ ఉపాధి హామీ పథకం 17వ సామాజిక తనిఖీ కోర్డినేషన్ సమావేశం శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా విజిలెన్స్ అధికారి యోగాంజులరెడ్డి మాట్లాడుతూ ఈ సామాజిక తనిఖీలు శుక్రవారం నుంచి ప్రారంభించి వారం రోజులపాటు అన్నీ గ్రామ పంచాయతీలలో డీపీఆర్‌ల తనిఖీ నిర్వహిస్తారన్నారు. తనిఖీలు జరుగు సమయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు అన్నీ పనుల తనిఖీకి సహకరించాలన్నారు. వారు అడిగిన సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. ఎంపీడీఓ జవహర్‌బాబు మాట్లాడుతూ తనిఖీ సమాచారం స్థానిక ప్రజాప్రతినిధులకు తెలపాలని, గ్రామ సర్పంచుల ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అధికారులు నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలపై సర్వే

సంబేపల్లె : ఎస్సీఈఆర్‌టీ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న స్టేట్ ఎడ్యుకేషనల్ అసెస్‌మెంట్ సర్వే – 2023 ప్రకారం విద్యార్థులలో ఉన్న అభ్యసన సామర్థ్యాలను అంచనా వేసేందుకు శుక్రవారం ఉదయం పాఠశాలలో పరీక్షలు నిర్వహించామని ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి తెలిపారు. ఈ సర్వే పరీక్షలు తెలుగు, ఇంగ్లిష్, గణితం పరిజ్ఞానంపై ఓఎంఆర్ షీట్స్ ద్వారా పాఠశాలలోని 3, 6, 9వ తరగతులకు ఆంగ్ల మాధ్యమంలో పరీక్ష నిర్వహించామన్నారు. దీని వలన బోధనా అభ్యసనలలో లోపాలను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. పరీక్షల నిర్వహణ కార్యక్రమంలో ప్రసాద్ బాబు, నాగ, అంబరీష్, శివకుమార్‌లు పాల్గొన్నారు.

చిన్నమండెంలో..

చిన్నమండెం : స్టేట్ ఎడ్యుకేషన్ అసెస్‌మెంట్ సర్వే(ఎస్‌ఈఏఎస్)లో భాగంగా చిన్నమండెం మండల వ్యాప్తంగా ఎంపిక చేసిన 17 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని 3, 6, 9వ తరగతుల విద్యార్థులకు పరీక్షలు నిర్వహించినట్లు ఎంఈఓలు ఆంజనేయులు, శివానాయక్ తెలిపారు. ఈ పరీక్షల నిర్వహణను శుక్రవారం పర్యవేక్షించారు. పరీక్ష నిర్వహణకు అవసరమైన సూచనలు, సలహాలను అందజేశారు. పరీక్షల నిర్వహణను కట్టుదిట్టంగా జరిగేలా చూడాలని ఉపాధ్యాయులకు వారు సూచించారు.



సంబేపల్లె: పరీక్ష రాస్తున్న విద్యార్థులు

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు

రాజంపేట టౌన్ : సచివాలయ ఉద్యోగులు ప్రజలకు సేవలందించడంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని డీఎల్‌డీఓ మూర్తి హెచ్చరించారు. పట్టణంలోని ఆర్‌ఎస్ రోడ్డులో ఉన్న ఒకటి, రెండవ సచివాలయాలను డీఎల్‌డీఓ శుక్రవారం అకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన సిబ్బందికి విధుల నిర్వహణ పట్ల దిశానిర్దేశం చేశారు. ప్రతి ఉద్యోగి కార్యాలయాలకు ఉదయం 10 గంటలకు విధిగా హాజరుకావాలన్నారు. అలాగే యూనిఫాం ధరించి రావాలని తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం మూడు గంటల నుంచి ఐదు గంటల వరకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. ఈ విషయంలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించారు.



రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ మూర్తి

వైద్య సిబ్బంది సర్వే

సిద్దవటం : మండలంలోని శాఖరాజుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని బాపణపల్లి గ్రామంలో మాధవరం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వేను నిర్వహిస్తున్నట్లు మాధవరం పీహెచ్‌సీ వైద్యాధికారి శివకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ శాఖరాజుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని బాపణపల్లి గ్రామాన్ని నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే–6 కింద ఎంపికైందన్నారు. అందువల్ల నేషనల్ టీమ్ ఈనెల 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు గ్రామంలో పర్యటించి వారికి అందుతున్నటువంటి వైద్య సేవలపై ఆరా తీస్తారన్నారు. కార్యక్రమంలో నాగవల్లి, జ్యోతి, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆరుతడి పంటలను సాగు చేయాలి

సిద్దవటం : మండలంలోని బొగ్గిడివారిపల్లె, ఉప్పరపల్లి రైతు భరోసా కేంద్రాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశామని బద్వేల్ వ్యవసాయ సహాయ సంచాలకు ఎం. నాగరాజు తెలిపారు. రెండు ఆర్బీకేల్లో యూరియా ఎరువులు పుష్కలంగా ఉన్నాయని ఆయన చెప్పారు. అనంతరం గ్రామస్థాయిలో వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రబీలో బోరు బావుల కింద ఆరుతడి పంటలు సాగు చేపట్టాలన్నారు. వరి సాగు ఎట్టి పరిస్థితిల్లోనూ సాగు చేయరాదన్నారు. డ్రిప్, స్ప్రింక్లర్ల వినియోగాన్ని పెంచాలన్నారు. బొగ్గిడివారిపల్లి చామంతి తోటలను పరిశీలించి కలుపు, సస్యరక్షణ చర్యలతోపాటు పోషక లోప సవరణ చర్యలు తీసుకోవాలని సూచించామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి సభ్యులు, రైతులు, వ్యవసాయ అధికారులు, ఆర్బీకే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణానికి ప్రభుత్వం పెద్దపీట

రామాపురం : నూతన ఆలయాల నిర్మాణాలకు జగన్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలో రామాలయం, శివాలయం నిర్మాణాల భూమి పూజలో ఆయన పాల్గొని మాట్లాడారు. రామాపురంలో రామాలయం నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరయ్యాయని చెప్పారు. ఇదే ప్రాంగణంలోనే శివాలయం నిర్మాణానికి గ్రామస్తులు, దాతలు ముందుకు రావడం హర్షణీయమన్నారు. శివాలయం నిర్మాణానికి టీటీడీ నుంచి నిధులు మంజూరునకు కృషి చేస్తామన్నారు. జగన్‌పాలనలో ఆలయాలకు మహర్దశ కలిగిందన్నారు. అనంతరం గ్రామస్తులు శ్రీకాంత్‌రెడ్డిని దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జనార్దన్‌రెడ్డి, జెడ్పీటీసీ మాసన వెంకటరమణ, మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు పెద్దిరెడ్డి, వైస్ ఎంపీపీలు రవిశంకర్‌రెడ్డి, బాబు, సర్పంచ్ నాగభూషణ్‌రెడ్డి, సూరం వెంకటసుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటేసు, సత్యాయాదవ్, సర్పంచ్‌లు వెంకటరెడ్డి, ఆయూబ్, మునీర్, సుబ్బయ్య, రఘురామయ్య, ఎంపీటీసీ రేఖం నారాయణ, కొండా ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

కొండంత అండగా సీఎం సహాయ నిధి

రాయచోటి టౌన్ : బాధితులకు కొండంత అండంగా సీఎం సహాయనిధి నిలుస్తోందని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం 13 మంది లబ్ధిదారులకు రూ.26.60 లక్షల సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. వీటిలో చిన్నమండెం మండలం చాకిబండకు చెందిన పోవాకులు చిన్న రెడ్డెయ్యకు రూ.9.50 లక్షలు, బోనమల గ్రామం కనకంటివారిపల్లె అక్కం వెంకటరమణారెడ్డి రూ. 3.75లక్షలు, లక్కిరెడ్డిపల్లె మండలం టీచర్స్ కాలనీకి చెందిన మొహిద్దిన్‌కు రూ.70 వేలు, కస్తూరిరాజు గారిపల్లెకు చెందిన బత్తినవాండ్లపల్లెకు చెందిన చందనకు రూ.1 లక్షలు, సంబేపల్లె మండలం రైతుకుంట దిన్నిమీదపల్లె నాగూరు పీరంబీకి రూ.50 వేలు, రాయచోటి పట్టణం కొత్తపేటకు చెందిన మచ్చా విజయప్పకు రూ. 2.5లక్షలు, బోస్‌నగర్‌కు చెందిన బేబీ సయ్యద్ సమియాకు రూ.1లక్షలు, ముద్దులూరు లక్ష్మిప్రసన్నకు రూ.1 లక్షలు, శిబ్యాల గ్రామం అనుంపల్లెకు చెందిన గుదే భుజంగ రావుకు రూ.65 వేలు, గాలివీడులోని అరవీడు గ్రామానికి చెందిన బేబీ నీలావతికి రూ.3లక్షలు, అరవీడు గాండ్లపల్లెకు చెందిన మంచూరి పార్వతమ్మకు రూ. 70 వేలు, మూడే మల్లీశ్వర నాయక్‌కు రూ. 30 వేలు, రామాపురం నల్లగుట్టపల్లెకు చెందిన రాణెమ్మకు రూ. 2లక్షల విలువ చేసే చెక్కులను అందజేశారు.



రామాపురం: ఆలయ నిర్మాణ పనుల ప్లాన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాయచోటి రూరల్ పరిధిలోని దిగువ అబ్బవరం గ్రామంలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ పైనేని ప్రభావతమ్మ, సివిల్ సప్లై రాష్ట్ర డైరెక్టర్ పోలు పుల్బారెడ్డి, మాజీ సర్పంచ్ తిరుపాల్ నాయుడు, మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, ఏపీఐఐసీ డైరెక్టర్ రాయవరం శ్రీనివాసుల రెడ్డి, జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు రెడ్డి, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్, పల్లపు రమేష్, రవిరాజు పాల్గొన్నారు.

గాలివీడు : గుర్రాలమిట్ట జగనన్న కాలనీకి చెందిన వార్డు సభ్యుడు లక్ష్మయ్య ప్రమాదంలో గాయపడి రాయచోటిలోని శ్రీ వెంకటేశ్వర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం అందడంతో శుక్రవారం ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి లక్ష్మయ్యను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.